ఆ వెర్రిగాంను చూస్తూనే తమిళనాడు ఎక్స్‌ప్రెస్‌లో ఢిల్లీ నుండి చెన్నైగా మారిన మద్రాసుకు నేను కళ్యాణి బయలుదేరాం. అక్కడినుండి ''ఈ రోడ్డు'' స్టేషన్‌కు దగ్గరగా వున్న ''పెరుందురై'' టి.బి. శానిటోరియంలో ఉన్న శేషగిరి కోసం మా ఈ ప్రయాణం. ''వాడెలా ఉన్నాడో'' అని మనసంతా బరువుగా, వ్యాకులంగా వుంది.

శేషగిరి మాకు దూరమై పదేళ్ళు!

నా స్థితిని గమనించిన కళ్యాణి, ఏదో వారపత్రికను నా చేతికిచ్చింది. అనాసక్తంగానే దానిని తిరగవేస్తుండగా లబ్ద ప్రతిష్టురాలైన ఓ రచయిత్రి కథ కనిపించింది, దానిలో.

''అసలు స్త్రీల గురించి ఈ మగాళ్ళకేం తెలుసు... లేని పోని... తమ, అహం అహంకారాలు తప్ప'' అంటూ ముగించిందా కథను ఆ రచయిత్రి.

ఆ చివరి వాక్యం ఆ ప్రయాణం పొడవునా నన్ను వెంటాడుతూనే ఉంది.



నన్ను వెంటాడుతోంది ఆ వాక్యమా... ఆ వాక్యం వెనుకాల నిలిచి వున్న ఓ రూపమా అన్నది, ఆ సాయంత్రానికి కాని స్ఫురించింది కాదు నాకు.

అవును... ఓ రూపమే! అది ''తామ్రపర్ణి''ది.

మరుక్షణం నా జ్ఞాపకాలు నన్ను - తామ్రపర్ణి ముందు నిలిపాయి. తామ్రపర్ణి మా శేషగిరికి ఒకనాటి ప్రియురాలు... ఆ తర్వాత అర్ధాంగి... ఆ పై వాడిచే విడవబడిన డైవోర్సీ.

శేషగిరి మా బాబాయిగారబ్బాయి. పిన్ని, బాబాయి వాడి అతి చిన్నవయసునే పోవడంతో వాడు మాతోనే పెరిగాడు

మా నాన్నగారు వాణ్ణి తన బిడ్డగానే ఎంతో ఆత్మీయంగా పెంచారు.

అమ్మా అంతే... ''చిన్నా.. చిన్నా'' అంటూ అంతే ఆత్మీయంగా పెంచింది.

శేషగిరి నాకంటే పదేళ్ళు చిన్న... వాణ్ణి నా సైకిలుమీద ఎక్కించుకుని వెళ్ళి వాడి స్కూలులో దించి... నేను నా హైస్కూలుకు వెళ్ళేవాణ్ణి. చాలా మందికి తెలియదు వాడు స్వయానా నా తమ్ముడు కాదని.

నేను ఎం.ఎ., బి.యల్. చేశాక యం.యల్. కూడా చేశాను. ఢిల్లీలో ఉద్యోగమయింది. సెంట్రల్ గవర్నమెంటు హూమ్ డిపార్టుమెంటులో అసిస్టెంట్ సెక్రటరీనయ్యాను. కల్యాణితో పెండ్లయింది. కళ్యాణి వాళ్ళది నెల్లూరు.

నాన్నగారు తన చివరిక్షణాలలో నాకు ఆస్తిపాస్తుల కంటే భద్రంగా అప్పగించింది శేషగిరినే ''జాగ్రత్త సుమీ'' అంటూ.

శేషగిరిని ఢిల్లీ వచ్చి నా దగ్గరే వుండి చదువుకోమన్నాను. కాని వాడికి అప్పటికే మద్రాసు 'గిండి'లో ఇంజనీరింగ్ సీటు వచ్చింది. అక్కడే చదువుతానన్నాడు. బాపట్ల ప్రాంతానవున్న మా ఆస్తులన్నీ అమ్మి వాడి పేర బ్యాంకులో వేసి వాడి ఇష్ట ప్రకారం, ''అలాగే'' మద్రాసులోనే చదువుకోమన్నాను.

''అతని భాగం ఆస్తిని అమ్మి ఇవ్వడం సరే... కాని నీ భాగం కూడా అమ్మి ఇవ్వడం ఎందుకు?'' అన్నారు మా సుబ్బారావు మామయ్య. సుబ్బారావు మా మేనమామ. అమ్మకు అన్నయ్య,

''శేషగిరి ఒకటి - నేనొకటి కాదు మామయ్యా'' అన్నాను నేను.

నేనన్నదే అమ్మా, అంది మావయ్యతో.

''వాడికి హోటలు తిండిపడదు... నేను వాడితో మద్రాసు

వెళతాను'' అని మద్రాసు వెళ్ళింది అమ్మ శేషగిరితో.

ఉద్యోగపు తొందరలతో నేను మద్రాసు వెళ్ళలేకపోయాను. కళ్యాణికి మద్రాసు బాగా తెలుసు... తానక్కడే చదువుకొందిట. అమ్మను శేషగిరిని తీసుకునివెళ్ళి అక్కడ ఆళ్వారుపేటలో వాళ్ళను సెటిల్‌చేసి, వాళ్ళతో నాలుగు రోజులుండి వచ్చింది.

ఆ తర్వాత కూడా, నాకు మద్రాసు వెళ్ళడం కుదిరేది కాదు. కళ్యాణి అప్పుడప్పుడు మద్రాసు వెళ్ళి వాళ్ళ సౌకర్యాలను చూచి వచ్చేది. వేసవి సెలవలకు అమ్మ, శేషగిరి ఢిల్లీ వచ్చి వెళ్ళేవారు.

బి.టెక్ అయిపోయాక శేషగిరి ఎం.టెక్‌లో చేరాడక్కడే... వాడు ఆఖరు సంవత్సరంలో ఉండగా, అమ్మ ''శేషగిరిని''గురించి... 'చిన్నా' ఈ సంవత్సరం అంత శ్రద్ధగా చదువుతున్నాడపించడం లేదు. ఎవరో అమ్మాయి తరచు వీడితో కన్పిస్తోంది. ఆ అమ్మాయి 'అరవ' పిల్లలా వుంది. అని జాబు వ్రాసింది.

నేనాపాటికి అసిస్టెంట్ సెక్రటరీ నుండి డిప్యూటీ సెక్రటరి నయ్యాను. పనితో పాటు రాష్ట్రాల మీద పర్యవేక్షణా భారం పెరిగింది. నాన్నగారు తన ఆఖరి క్షణాలలో శేషగిరిని నా కప్పగించినా, ఆ బాధ్యతను నా కంటే ఎక్కువగా కళ్యాణే స్వీకరించింది. తానే మద్రాసు వెళ్ళింది. నాలుగు రోజులలో తిరిగి వస్తానని వెళ్ళిన కళ్యాణి వారానికి తిరిగి వచ్చింది.


''ఏమిటిట'' అని ప్రశ్నించిన నాతో...

నా అధికార పరిధిలో వివిధ రాష్ట్రాల నుండి నా పరిశీలన కొచ్చే, ఇంటిలి జెన్సు రిపోర్టు కన్నా వివరంగా – 'అమ్మ' జాబులోని సంశయాలపై తన రిపోర్టు ఇచ్చింది కళ్యాణి.

శేషగిరికి సాయంత్రపు సమయాల – 'మెరీనా' బీచికి వాహ్యాళిగా వెళ్ళటం... అక్కడ జనసమ్మర్దపు కోలాహలాన్ని చూస్తూ... అలల సవ్వడిని అనుభవిస్తూ, చిరు చీకట్లు కమ్మేవరకు గడపటం ఒక వ్యాపకం అయిందట.

ఆ బీచిలో ఓ పూల అంగడి. అందులో అన్నిరకాల పూలు దొరుకు తాయట. అందున సంపెంగలు ప్రత్యేక ఆకర్షణ. శేషగిరికి సంపెంగల పరిమళం చాలాఇష్టం. రోజూ వాటిని కొని, ఇంటిలో తన గదిలో టేబులు మీద వాటి నుంచి అవి విరజిమ్మే సౌరభాన్ని ఆస్వాదిస్తూ చదువు కోవటం అలవాటుగా మారిందట.

అదిగో అక్కడే ఆ సంపెంగల పట్ల అలాంటి ఇష్టంతోనే వాటిని కొనుక్కొని తన జడలో తురుము కొనే – ''తామ్రపర్ణి'' శేషగిరికి తటస్థ పడటం, ఇద్దరి అభిరుచులు, సంపెంగల పట్ల ఒకటవ్వటం మూలంగా మొదటిలో ఒకరినొకరు చిన్నపాటి చిరునవ్వుతో అభినందించుకోవటంతో మొదలయిన ఆ ''మౌన పరిచయం'' క్రమంగా ఒకరిని గురించి మరొకరు తెలుసుకోవడం, ఆ తర్వాత, ఆ సంధ్యాసమయాల ఒకరిరాక కోసం మరొకరు, ఆ పూల అంగడి దగ్గర ఎదురు చూచుకోవటం వరకు కొనసాగిందిట.



''ఆ పైన'' అన్న నా ప్రశ్నకు....

ఆపైన ఏముంటుంది.... ఒకరి కోసం మరొకరు ఎదురుచూపులు చూచు కొనే పర్వం ముదిరి, ఇద్దరు ఆ జనసమూహాలకు దూరంగా జరిగి, ఎన్నో

# ఈ మాత్రం తెలుసు

## గంధం యాజ్ఞవల్క్య శర్మ



స్వీటు నథింగ్స్ మధ్య ఓలలాడి వుంటారు... అలా సాగిన ఆ ప్రేమో దంత కాలాన, శేషగిరి ఆ అమ్మాయితో తన స్కూటరుపై ఏ అర్థరాత్రి వరకో షికార్లుకొట్టి ఆలస్యంగా ఇంటికి రావటాలను అత్తయ్యగారు గమనించి మనకు జాబు వ్రాసారు.... అంటూ కళ్యాణి తన రిపోర్టును కొనసాగించింది.

శేషగిరి నంగి నంగిగా అరకొర మాటలతో సిగ్గుపడుతూ ''తామ్రపర్ణి'' గురించి చెప్పాడు నాతో...

''తప్పేముందయ్యా'' అనే నా వైఖరిని గమనించి....

ఆ మరునాడు తామ్రపర్ణిని తీసుకొని వచ్చి నాకు చూపించాడు.

''తామ్రపర్ణి'' మద్రాసు మెడికల్ కాలేజీలో యం.బి.బి.ఎస్. చేసి జనరల్ హాస్పిటల్‌లో హౌస్‌సర్జన్‌గా చేస్తోంది. వాళ్ళ నాన్నగారు లాయరు. రెండుతరాల క్రిందట మద్రాసు చేరి అక్కడ స్థిరపడిన తెలుగు కుటుంబం వారిది. ఆయన భార్య 'తమిళ వనిత', ఆమెగారు కూడా లాయరే. తామ్రపర్ణి వాళ్ళకు ఏకైక సంతానం. తెలుగును, తమిళాన్ని ఉభయ భాషా ప్రవీణలా స్వచ్ఛంగా మాట్లాడుతుంది తాను.

మన శేషగిరి అందగాడే కదా.... అలాగే తామ్రపర్ణి కూడా సౌందర్యవతే. ఆమెతో మాట్లాడాక ఆమెది బాహ్యసౌందర్యమే కాదు అంతః సౌందర్యం కూడా అనిపించింది.

వాళ్ళిద్దరిని, తరచితరచి ప్రశ్నించి చూసాను. అదేదో ఆషామాషీ విషయం కాదు. గాఢంగా పెనవేసుకున్న 'కథే' అనిపించింది. వాళ్ళింటికి వెళ్ళి తామ్రపర్ణి తల్లిదండ్రులను కలిశాను, వాళ్ళకు శేషగిరి గురించి తామ్రపర్ణి చెప్పిందట. ఎంతో మర్యాదస్తులు వాళ్ళు.....

''వచ్చే వేసవిసెలవల్లో – మేమే ఢిల్లీ వచ్చి మీతో మాట్లాడాలను కొంటున్నాం'' అన్నారా లాయరు దంపతులు.

''మాకేం అభ్యంతరం లేదు మీకు వెసులుబాటైన ఆ వేసవికల్లా శేషగిరి చదువు – మీ అమ్మాయి హౌస్ సర్జన్ పూర్తి అవుతాయి కనుక, ఆ వెంటనే ముహూర్తాలు పెట్టేసుకుందాం'' అన్నాను నేను.

''వాళ్ళు సంతోషించారు''

అత్తయ్యగారి మదిలో ఏవో సంశయాలు.

''వాళ్ళు ఒకరిని ఒకరు ఇష్టపడ్డారు. అవతల వారిది సంప్రదాయమైన కుటుంబం. తామ్రపర్ణి భార్య అయితే శేషగిరి సుఖపడతాడు'' అని చెప్పాను. అత్తయ్యగారు సరే అలానే కానివ్వండి అన్నారు. అంటూ తన రిపోర్టు ముగించింది కళ్యాణి.

***

ఆ వేసవిలో ఎంతో వైభవముగా జరిగిన ''శేషగిరి, తామ్రపర్ణి''ల వివాహంలో ఒకే ఒక్కతీర్చలేని లోటు –

''అమ్మలేక పోవడం'' అమ్మ కాలం చేసి మూడు నెలలు అయిందప్పటికి.

''అత్తయ్యగారు... శేషగిరి కళ్యాణం చూడలేక పోవడం ఎంతో దురదృష్టం'' అనుకొంది కళ్యాణి.

***

నా ఆలోచనల మధ్యనే మేము మద్రాసు చేరాము. ''ఈరోడ్డు'' క్లే రైలు లోకి మారాము. కాని నా స్మృతిని తామ్రపర్ణి వెంటాడుతూనే ఉంది.

పెండ్లి అయ్యాక శేషగిరికి పెద్దకార్ల కంపెనీలో ఉద్యోగమైంది. తామ్రపర్ణి గవర్నమెంటు జనరల్ హాస్పిటల్‌లో డాక్టర్‌గా చేరింది. సంవత్సరం తిరిగే పాటికి వారిద్దరి ''మధ్య''లో ఏవో చిన్నపాటి అభిప్రాయ బేధాలు... సర్దుకుపోదగినవేనట – కాని సర్దుకోలేక పోయారు.

అవి చిలికిచిలికి గాలివానలా తయారయ్యేస్థితిలో కళ్యాణి దృష్టికొచ్చి నట్లుంది. అందుకోసం వెళుతున్నట్లు అని నాతోచెప్పక, వారం రోజులలో తిరిగి వస్తానని చెప్పి మద్రాసు వెళ్ళింది కళ్యాణి. వాళ్ళ కొత్త కాపురం ఎలా వుందో చూచిరావటానికి కామోలు అనుకొన్నాను. కాని నాలుగు రోజులకే తిరిగి వచ్చింది.

'ఏదో ఓడిపోయిన దానిలా... చాలా వ్యాకులంగా' కన్పించింది.

''ఏమయింది అని ప్రశ్నించాను''.

''నేను మొదటిసారి తామ్రపర్ణి – శేషగిరిలను చూచినప్పుడు వారిద్దరి మధ్య ఉన్నది ఆషామాషి వ్యవహారం కాదు – గాఢంగా పెనవేసుకొన్న ప్రేమానుబంధం అనుకొన్నాను... కాని మన శేషగిరి విషయంలో నా అంచనా తప్పయింది....

అతనిలో 'అహం', భరించలేని పురుషాహంకారం!

తామ్రపర్ణిది మాత్రం ఆత్మాభిమానమే... ''తననేం అనలేము''.

తామ్రపర్ణి చాలా డ్యూటీ మైండెడ్... తోటి డాక్టర్లతో కలిమిడిగా వుండ వలసిన వృత్తి తనది. అర్ధరాత్రి, అపరాత్రి డ్యూటీ పరంగా అర్జంటు కేసులు, పిలుపులు వుంటాయి. ఆపరేషన్లు... ఉంటాయి.

అవి గిట్టలేదట శేషగిరికి. నైట్ డ్యూటీలు వద్దన్నాడు.

ఎలా కుదురుతుంది. తామ్రపర్ణికి వృత్తి పట్ల గౌరవం... అంకితభావం...

రిజైన్‌చేసి ఇంటి పట్టున వుండమన్నాడు శేషగిరి.

''తామ్రపర్ణి ఆ ఆంక్షలను జీర్ణించుకోలేక పోయింది'' అలా చేయలేనంది.

ఆమె ఆత్మాభిమానం దెబ్బతినేలా మాట్లాడి అవమానించాడు శేషగిరి.

'ఇద్దరిని కూర్చోపెట్టి మాట్లాడాలని ప్రయత్నించాను'.

'ఒప్పించలేక పోయాను. తామ్రపర్ణి ఒక వస్తువైనట్లు ఆ వస్తువుపై తనకు పూర్తి హక్కులు, అజమాయిషీ వున్నట్లు – తన అభీష్టమే అంతిమం అన్నట్లు మూర్ఖంగా మాట్లాడాడు శేషగిరి'.

తామ్రపర్ణికి 'శేషగిరి' చెప్పినట్లు నడుచుకోమని సలహా ఇవ్వడం, ధర్మం కాకపోవడమే కాక – అమానుషం కదూ...!

''మీ నాన్నగారిలోని 'బంధుప్రీతి' 'ఆర్ద్రత' – మీలోని విశాల భావాలు. అర్థంచేసుకొనే విజ్ఞత. ఓరిమి శేషగిరికి ఎందుకు అబ్బలేదో'' నిట్టూర్చింది కళ్యాణి.

''నేను చేయగల్గింది ఏదీ లేక, కాలమే ఇలాంటి సమస్యలను సర్దుబాటు చేస్తుంది అనే ఆశతో తిరిగి వచ్చేసాను'' – అంది కళ్యాణి.

నేను అలాగే అనుకొన్నాను.

కాని... మరో మూడు నెలలు గడవకముందే మా ఆశలన్ని వమ్ముచేస్తూ శేషగిరి 'తామ్రపర్ణిని' పుట్టింటికి పంపివేసి ఆపై విడాకుల నోటీసు పంపాడట.

తామ్రపర్ణి నాన్నగారి ద్వారా ఈ విషయం తెలిసికొన్న నేను శేషగిరిని ఫోనులో పిలచి – ''చిన్నా తొందరపడవద్దు'' అని వారించబోయాను.

''ఇది నా స్వవిషయం మీరు కల్పించుకోవద్దు'' అంటూ చాలా నిష్కర్షగా జవాబిచ్చాడు. అవాక్కయ్యాను. నాకొక్కటి మొదటిసారిగా అర్థమయింది. నాన్నగారు నాకు శేషగిరిని అప్పగించారు కాని... శేషగిరి మాత్రం తనను నాకప్పగించుకోలేదు.

తామ్రపర్ణి విడాకులకు, అభ్యంతరం పెట్టలేదట, అసలు కోర్టుకే హాజరు కాలేదట.

వారి వివాహ బంధం అలా తెగిపోయింది!

''అత్తయ్య గారు వీరి వివాహం చూడలేకపోయినందుకు – 'దురదృష్టం' అనుకొన్నాను. కాని ఈ దశ చూడకుండా దాటిపోయినందుకు – అదృష్టవంతురాలు'' అన్నది కళ్యాణి. నేను కళ్యాణి ఈ పరిణామాల పట్ల నిస్సహాయంగా మిగిలిపోయాము. శేషగిరికి మా పట్ల – మా పెద్దరికాల పట్ల లక్ష్యం లేకపోవటమే కాదు – మేము తనను సమర్థించలేదని వైరభావం ఏర్పడినట్లుంది.

తానక్కడ నుండి ఉద్యోగం మాని, బెంగుళూరులో మరో కంపెనీలో చేరాడట. ఈ పదేళ్ళకాలంలో చాలా కంపెనీలకు మారుతూ ఉండి పోయాడట. 'గుజరాతు'లో ఉన్నాడని, అక్కడనుండి విదేశాలకు వెళ్లాడని.... తిరిగి వచ్చి 'బొంబాయి'లోను ఆ పై కేరళలోను ఉన్నాడని వార్తలు. ఈ వార్తలను ఎలా సేకరించేదో – కళ్యాణికి తెలిసేవి, కాని చాలా ఆలస్యంగా అతడా ప్రదేశాల నుండి వెళ్ళాక తెలిసేవి. అలా మాకు దొరికేవాడు కాడు శేషగిరి.

శేషగిరి పట్ల నాన్నగారు నాకు అప్పగించిన బాధ్యతను సరిగా నిర్వహించ లేక పోయాననే భావం ఒక్కటే కాదు – చిన్నతనం నుండి వాడితో పెన వేసుకున్న అనుబంధం కూడా జ్ఞాపకం వచ్చి చాలా పర్యాయాలు వాడి ఆచూకీ కోసం ప్రయత్నించాను. కాని తానెక్కడున్నాడో తెలియనిచ్చే వాడే కాదు.

ఇదిగో ఈ పదేళ్ళ తర్వాత శేషగిరిని గురించి ఈనాటికి ఒక వార్త వచ్చింది.

మద్రాసు రాష్ట్రంలో – కోయంబత్తూరు జిల్లా 'పెరందురై' టి.బి. శానిటోరియం సూపర్నెండెంటు వద్ద నుండి ''శేషగిరి అనే రోగి ఆరోగ్య పరిస్థితి ఏమి బాగు లేదు.... మీరు వారికి కావలసిన వారనే సమాచారం మేరకు తెలియపరచడమైనది'' – అంటూ ఓ టెలిగ్రాము వచ్చింది. వెంటనే నేను కళ్యాణి బయలుదేరాము.

***

ఆ టి.బి. శానిటోరియం ఒక విశాలమైన ప్రదేశాన, కొన్నివందల ఎకరాల విస్తీర్ణంలో 'పెరుందురై' ఊరికి కూత వేటు దూరాన నెలకొని వుంది. దారి చూపగా, శేషగిరి ఉన్న పన్నెండో నెంబరు క్వార్టరులో అడుగు పెట్టాము నేను కళ్యాణి.

మొహమంతా మునిగిపోయిన గడ్డంతో, చిక్కిశల్యమైన తనువుతో బెడ్‌పై స్పృహలేని శేషగిరి ఆకారాన్ని చూసి ''వీడా శేషగిరి'' అన్నంత సంశయంగా పక్కనే ఉన్న కుర్చీపై కూర్చుని వస్తోన్న దుఃఖాన్ని అదిమి పట్టుకొని – 'చిన్నా' అని పిలిచాను. అలా పలుమార్లు పిలు

కవిత

## కలుపు మొక్కలు




త్రేతాయుగం సీత ఇంకా ఆ 'శోక' వనంలో మగ్గుతూనే ఉంది
పది తలల రావణుడు పది నోళ్లతో పరిహసిస్తూనే ఉన్నాడు
ఒక చేత్తో కత్తి, మరో చేత్తో ఆసిడ్ బాటిల్ పట్టుకుని కసాయిలా కవ్విస్తూనే ఉన్నాడు
ద్వాపరంలో ద్రౌపది ఇంకా పరుగులిడుతూనే ఉంది
కీచకుడి కబంధ హస్తాల నుండి తప్పించుకునే తరుణం కోసం తపిస్తూనే ఉంది
సత్యం, ధర్మం, అహింస, నీతి, న్యాయం అనే పంచ పాండవులు ఆదుకొంటారని ఆశ పడుతోంది
కలియుగంలో అవి కాలధర్మం చెందాయని తెలిసే సరికి కాలాతీతమయింది
రక్షిస్తానన్న వలలుడు తలుపు చాటునుండి తొంగి తొంగి చూస్తున్నాడు
కుంటి సాకులతోనే కాలక్షేపం చేస్తున్నాడు
ప్రేమ ప్రకృతైతే, వ్యామోహం వికృతిగా మారింది
తాళి ఎగతాలి కాబడితే, సహజీవనం సహధర్మంగా భాసిల్లింది
నమ్ముకున్న సిద్ధాంతాలు కమ్ముకున్న మేఘాల్లా విడిపోతుంటే,
మానం అవమానం పాలవదని అనుమానం లేదు
యుగాలు మారినా మృగాల నైజం మారుతుందనడానికి సాక్ష్యాలూ లేవు
పెళ్ళికి ముందు శృంగార భంగపాటు కాదనుకొంటే,
వీధికో విధి వంచిత విధిగా ఉంటే వింతేముంది
ఆయేషా, అనూష, ప్రత్యూష, స్వాప్నిక కాలగర్భంలో కలసిపోయినా,
కీచకుడి వారసులు, రావణుడి రాక్షసగణం గర్భం చీల్చుకుని పుడుతూనే ఉన్నారు
సభ్య సమాజపు తోటలో కలుపు మొక్కల్లా పెరుగుతూనే ఉన్నారు
ముప్పయిమూడు శాతం కోటాతో నయినా మహిళ బతుకుకు స్వాంతన చేకూరేనా?

–వి.వి. కూర్మారావు

*9848521903*

వగా, అతి కష్టం మీద కొంచెం కొంచెంగా కనులు తెరిచి నన్ను కళ్యాణిని చూచాడు. వాడి కనులలో ఒకటి రెండు అశ్రుకణాలు ప్రత్యక్షమై జాలువారాయి.

''ఏమిటిరా ఇలా.... మేము లేమనుకొన్నావా'' అంటూ దుఃఖం ఆగక భళ్ళుమన్నాను.

నా వెనుకనే నిలుచుని వున్న కళ్యాణి నా భుజంపై చేయివేసి వారించింది! శేషగిరి, నన్ను కళ్యాణిని మార్చి మార్చి చూస్తూ శక్తిలేనట్లు కనులు మూసుకున్నాడు. మూసిన వాడి కనుల నుండి ధారావాహికంగా కన్నీరు కారుతూనే వుంది.

అక్కడ ఉన్న నర్సు చెప్పింది....

దగ్గర దగ్గర నెలరోజుల క్రిందట శేషగిరి తీవ్రమైన వ్యాధితో శానిటోరియంకు - ఒంటరిగా వచ్చి చేరాడని, నాలుగు రోజుల క్రిందట వరకు జనరల్ వార్డులోనే సామాన్య రోగిగా ఉన్నాడని.

విజిటింగ్ గెస్ట్‌గా శానిటోరియం చూడటానికి వచ్చిన ఒక డాక్టరు - శేషగిరిని చూసి స్పెషల్‌వార్డుకు మార్పించి అహర్నిశలు కనిపెట్టుకొని వుండి శ్రద్ధగా సేవలందిస్తూ వైద్యం చేస్తున్నారట.

ఆ నర్సును ప్రక్కకు తీసుకువెళ్ళి - ప్రస్తుతం శేషగిరి ఆరోగ్య పరిస్థితి ఏమిటని ప్రశ్నించిన కళ్యాణితో...

''చాలా ఆందోళనకరంగా వుంది... కాని వీరిపై శ్రద్ధ వహించి ట్రీట్‌మెంటు చేయిస్తున్నారే ఆమె గారు మాత్రం ఆశావహంగానే ఉన్నారు'' అంది.

''ఆమెగారా... ఎవరామె... ఎక్కడుంటారు'' ప్రశ్నించింది కళ్యాణి.

''ప్రస్తుతం ఇక్కడే, ఈ క్వార్టర్సులోనే వుంటున్నారు.... అరుగో ఆ వస్తున్నారే'' అంటూ దూరంగా నడిచివస్తున్న ఆమె కేసి మా చూపును మరలించిందా నర్సు.

తెలిసినట్లే అనిపిస్తోన్న ఆ రూపాన్ని సరిగ్గా ఎవరో పోల్చలేకపోయాను నేను.

కాని కళ్యాణి - 'అవునా' అంటూ ఎంతో ఆశ్చర్యం తన మోముపై ప్రత్యక్ష మవ్వగా ఆ వస్తోన్న వ్యక్తికేసి వడివడిగా నడిచి ఎదురువెళ్ళి అమాంతంగా కౌగిలించుకొంది.

డాక్టరు దుస్తులలో కాక - తెల్లని చీరలో తలపై ఒక సేవా సంస్థను తెలిపే చిహ్నాన్ని ధరించి, ప్రశాంత వదనంతో - కనిపిస్తున్న ఆమె ఎవరో దగ్గరకు వచ్చాక పోల్చుకున్నాను.

''తామ్రపర్ణి''!

ఈ పదేళ్ళలో మాకు శేషగిరి ఆచూకీనే కాదు తామ్రపర్ణి గురించి కూడా ఏమి తెలియదు.

ఒక్కసారి ఎప్పుడో వాళ్ళు విడిపోయిన కొత్తలో, శేషగిరిని గురించి వాకబు చేయడానికి ప్రయత్నించిన కళ్యాణి అతనిజాడ కనుక్కోలేక పోయినా.. ''తామ్రపర్ణి జనరల్ హాస్పిటల్‌లో డాక్టరుగా లేదు'' అని మాత్రం తెలుసుకోగలిగింది.

ఆ తర్వాత మళ్ళీ ఇన్నాళ్ళకు తామ్రపర్ణి!

కళ్యాణి ఆనాటి సాయంత్రానికల్లా తామ్రపర్ణి ద్వారా సేకరించిన సమాచారం నా ముందుంచింది.

తామ్రపర్ణి, శేషగిరి నుండి విడబడ్డాక జనరల్ హాస్పిటల్‌లో ఉద్యోగం మానివేసిందట. ఉత్తరప్రదేశ్‌లో - సంఘ అనాదరణకు గురై దీనాతి దీనంగా బ్రతుకు వెళ్ళదీస్తున్న అభాగ్య మానవాళి సేవలకు అంకితమైన, ఒక సేవా సంస్థ నెలకొల్పిన హాస్పటల్‌లో చేరి తనవంతు సేవలందిస్తూ ఆ హాస్పటల్‌కు అనుసంధానమైన మెడికల్ కాలేజీలో లెక్చరర్‌గా పని చేస్తోందట.

క్షయవ్యాధి నివారణకు పేరొందిన శానిటోరియంను - అక్కడి వైద్య విధానాన్ని చూసేందుకు విద్యార్థులతో వచ్చిన తామ్రపర్ణికి రోగిగా, చరమదశలో స్పృహలేని దశలో శేషగిరి కన్పించాడట. ఎందుకో అతనికి సరిగా వైద్యం జరగకపోవటం - అతనిని అంటిపెట్టుకొని ఎవరు ఆప్తులు లేకపోవడం గమనించిన తామ్రపర్ణి, అతనిని జనరల్ వార్డు నుండి, ఈ స్పెషల్ వార్డుకు మార్పించి, తానక్కడే వుండి, తనతో వచ్చిన విద్యార్థులను వెనక్కు పంపి - శేషగిరికి జరుగుతున్న వైద్యాన్ని పర్య వేక్షిస్తోందట. శానిటోరియం సూపర్నెంటుకు - నా చిరునామా ఇచ్చింది తామ్రపర్ణేనట.

తామ్రపర్ణి మాతోనే, ఆ పన్నెండో నెంబరు క్వార్టర్సులోనే వుండి పోయింది. మరో నెల రోజులు ఆ కాలమంతా, మేము చూసింది, కేవలం గత కాలాన మాకు తెలిసిన తామ్రపర్ణిని కాదు - ఒక సేవామూర్తిని, దీక్షా దక్షతలను తనువుగా ధరించిన తామ్రపర్ణిని. ఒక్క శేషగిరినే కాదు. ఆ శానిటోరియంలో ఉన్న ప్రతిరోగిని, తన చెరగని చిరునవ్వుతో పలకరిస్తూ, ధైర్యం చెబుతూ కనిపించేది, ప్రతి నిత్యము.

ప్రతి ప్రాతః సంధ్య ఓ ఫొటో ముందు కనులు మూసుకొని, ప్రార్థన చేసుకొనే తామ్రపర్ణి కనిపించేది. ఆ ఫొటో ప్రపంచ మెరిగిన మహోన్నత మూర్తి మథర్ థెరిస్సాది.

శానిటోరియంలోని డాక్టర్లంతా - హోప్‌లెస్ కేస్ అని భావించిన శేషగిరి, ఒక అద్భుతమూర్తి సంకల్పమా అన్నట్టు, నెల తిరిగేపాటికి వ్యాధి నుండి విముక్తుడై కోలుకోగలిగాడు. మరో మూడు నెలలు, ఇంటి పట్టునే వుండి మందులు తీసికొంటూ విశ్రాంతి తీసుకుంటే చాలు అంటూ శేషగిరిని శానిటోరియం నుండి డిశ్చార్జి చేశారు.

తన వైఖరికి, పశ్చాత్తాపపడుతున్న కొత్త వ్యక్తిలా శేషగిరి మారిపోయాడు. తామ్రపర్ణి పట్ల గతంలో తన ప్రవర్తనకు సిగ్గుపడుతోన్న వ్యక్తిలా కన్పించాడు.

మూడు నెలల విశ్రాంతి కోసం శేషగిరిని మాతో పాటు ఢిల్లీ తీసుకు వెళ్ళ బోతూ.... గతాన్ని మరిచి - శేషగిరి అంగీకరించి అతనితో వుండి పొమ్మని తామ్రపర్ణిని కోరాను.

చిరునవ్వుతో నా అభ్యర్థనలాంటి సూచనను అతి సున్నితంగా త్రోసిపుచ్చింది తామ్రపర్ణి.

''శేషగిరి ఇక్కడ నాకు గతంలో తెలిసిన వ్యక్తిగాకాక, ఒక అంత్యదశ చేరిన రోగిగానే కన్పించాడు. అతనిని అంటిపెట్టుకొని ఎవరులేక పోవడం గమనించి - ఒక సేవా సంస్థకార్యకర్తగా, సేవలందించాను. అంతకు మించి మరే ప్రత్యేకతా లేదు.

ఇప్పుడు కోలుకొన్న శేషగిరి తనకు తానున్నాడు

అతనికి మీరున్నారు.

కాని ఈ సమాజంలో ఎవరూ లేని దీనులు మరెందరో ఉన్నారు. వారికి ఎవరున్నారు?

క్షమించండి... నా కర్తవ్యాల నుండి మరలాలని నాకు లేదు'' - అంటూ తామ్రపర్ణి తన పూర్వపు హాస్పిటల్‌కు వెళ్ళిపోయింది.

ఈ నెలరోజులుగా శేషగిరి పట్ల తామ్రపర్ణి చూపిన శ్రద్ధాసక్తులను, సలిపిన సేవను చూసిన నేను ఆమె శేషగిరితో ఉండిపోతుందని ఆశపడ్డాను. తామ్రపర్ణి తన నిర్ణయంతో నన్ను నివ్వెరపరచింది. డిజప్పాయంటు అయ్యాను. అంతే కాదు తామ్రపర్ణిపై నాకు కోపం కూడా వచ్చింది.

తమాయించుకొన్నాను.

తామ్రపర్ణికి కళ్యాణి మాట పట్ల ఎనలేని గౌరవం వుంది. అందుకే కళ్యాణిని తామ్రపర్ణికి నచ్చచెప్పమన్నాను.

కళ్యాణి - తల అడ్డంగా ఊపుతూ - నిరాకరించింది.

నాకు కళ్యాణిపై కూడా కోపం వచ్చింది.

''తామ్రపర్ణి ఇప్పుడొక వ్యక్తి కాదు... ఒక వ్యవస్థ. ఆమెను ఒక మామూలు గృహిణి స్థాయికి దించేయాలనుకోవటం కరెక్టు కాదు'' - అంది కళ్యాణి.

అప్పుడు జ్ఞాపకానికొచ్చింది. రైలు ప్రయాణంలోనే చదివిన కథలోని - అసలు స్త్రీల గురించి ఈ మగాళ్ళకేం తెలుసు. లేనిపోని తమ, అహం... అహంకారాలు తప్ప అన్న ఆ వాక్యం!

❑

*రచయిత సెల్ నెం:* ***9885320765***



## మతం మార్చుకోనున్న నయనతార?

నయనతార, ప్రభుదేవాల వ్యవహారం తెలియని ప్రేక్షకులు చాలా తక్కువ. ప్రభుదేవ భార్య నయనతారకు గట్టిగా వార్నింగిచ్చినా దాన్ని పెద్దగా పట్టించుకోకుండా తన తిరుగుళ్ళను కొనసాగిస్తున్న నయనతారకి ఇప్పుడు కొత్తగా ఓ ఆలోచన వచ్చింది. ప్రభుదేవకు రెండవ భార్యగా ఉండేందుకు అనువుగా మతం మార్చుకోవాలన్న ఆలోచనలో పడింది. ఇది సరైన ఆలోచన కాదని సన్నిహితులు ఎంత చెబుతున్నా ఆమె పట్టించుకునే స్థితిలో లేదట! ఎలాగైనా సరే ప్రభుదేవాను పెళ్ళి చేసుకొని అతని దర్శకత్వంలో సినిమాలు నిర్మించాలన్న గట్టి ఆలోచనలో ఇప్పుడు నయనతార ఉంది. తెలుగులో 'సింహా' తరువాత పెద్దగా అవకాశాలు రాకపోవడం, కోలీవుడ్ కాదనగా, బాలీవుడ్ పొమ్మనడంతో నిర్మాతగా మారడమే శ్రేయస్కరమన్న నిర్ణయానికి నయనతార వచ్చిందని అంటున్నారు. వీలనైంత త్వరలో మతం మార్చుకొని, ప్రభుదేవాను పెళ్ళి చేసుకొని, సినిమా నిర్మాతగా అవతారం ఎత్తాలన్న తొందరలో నయనతార ఉందన్నదని తాజా సమాచారం.